నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
10 | వరంగల్, బుధవారం 5 మార్చి 2025 | MAHABUBABAD



పాకాల ఏటిలోని గుంతల్లో నీటిని మళ్లించేందుకు మోటర్‌ను సరిచేస్తున్న ఆయకట్టు రైతులు

ఫీల్డ్ విజిట్

| జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వలు | | | | |
|---|---|---|---|---|
| చెరువులు | 25శాతం | 50శాతం | 75శాతం | 100శాతం |
| 1063 | 744 | 212 | 107 | 00 |

- ప్రశ్నార్థకంగా మానుకోట రైతుల పరిస్థితి
- అడుగంటిన చెరువులు, వాగులు, బావులు
- అంతకంతకూ పడిపోతున్న భూగర్భ జలాలు
- ప్రమాదకరంగా కొత్తగూడలో 15.20 మీటర్ల లోపలికి..
- వేలకొద్దీ ఎకరాల్లో ఎండుతున్న వరి, మక్కజొన్న, పత్తి


పెద్దవంగర: గంట్లకుంటలో ఎండిపోతున్న పంటను చూపుతున్న రైతు


బంజార తండా సమీపంలో నీళ్లు లేక రాళ్లు తేలిన పాకాల ఏరు

| జిల్లాలో భూగర్భ జలాల వివరాలు (మీటర్లు లోతులో) | | |
|---|---|---|
| మండలం | జనవరి | ఫిబ్రవరి |
| చిన్నగూడూరు | 3.84 | 4.55 |
| డోర్నకల్ | 1.20 | 2.40 |
| గూడూరు | 4.40 | 4.80 |
| కేసముద్రం | 4.69 | 4.76 |
| కురవి | 0.84 | 1.10 |
| మహబాద్ | 3.32 | 3.65 |
| నెల్లికుదురు | 3.26 | 4.90 |
| బయ్యారం | 1.20 | 1.30 |
| దంతాలపల్లి | 2.26 | 3.10 |
| గంగారం | 3.74 | 4.65 |
| గార్ల | 4.10 | 4.50 |
| కొత్తగూడ | 10.43 | 15.20 |
| మరిపెడ | 4.23 | 4.40 |
| నర్సింహులపేట | 5.49 | 6.75 |
| పెద్దవంగర | 5.19 | 5.33 |
| తొర్రూరు | 6.72 | 7.85 |

# యాసంగి సాగుడెట్ల..?

***జలవనరులు అడుగంటి.. భూగర్భ జలాలు అథః పాతాళానికి పడిపోతుండడంతో పంటలకు చుక్క నీరందడం లేదు. ఏటా వేల ఎకరాల్లో వరి, మక్కజొన్న, పత్తి, ఇతర పంటలు పండించే మానుకోటలో ఈ యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. కేసీఆర్ సర్కారు పాలనలో పదేళ్లుగా మండుటెండల్లోనూ వాగులు, చెరువులు, కుంటలు, వాగులు పరవళ్లు తొక్కగా, బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరుండేది. కానీ, ఎప్పుడూ లేని విధంగా కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఈ ఏడాది చెరువులు, వాగులు వట్టిపోవడం, బోర్లు, బావు ల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయి రైతులకు దిక్కుతోచని పరిస్థితిలో పడేసింది. కొత్తగూడ మండలంలో జనవరిలో 10.43 మీటర్ల లోతుకు వెళ్లిన భూగర్భ జలాలు ఫిబ్రవరి నెలాఖరుకు 15.20 మీటర్లకు పడిపోయాయి. అంతేగాక జిల్లాలోని మొత్తం 1063 చెరువుల్లో 744 చెరువుల్లో కేవలం 25శాతం మాత్రమే నీరుండడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. వరి పొట్టకొచ్చే సమయంలో నీళ్లు లేకపోవడంతో రైతులు చేసేదేమీ లేక గొర్లను. బర్లను మేపాల్సి వస్తోంది.***

*- మహబూబాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ)*

మహబూబాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు చెరువులు, కుంటలు, వాగులు.. బోర్లు, బావులతో పాటు ఎస్సారెస్పీ స్టేజీ-1, స్టేజీ-2 మీద ఎక్కువగా ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో కాళేశ్వర జలాలను ఎస్సారెస్పీ కాల్వల ద్వారా వాగులు, చెరువులు నింపి రైతులకు 24గంటలు సాగునీరందించడంతో వ్యవసాయం రంది లేకుండా సాఫీగా సాగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి తలకిందులైంది. అదునుకు సాగునీరు విడుదల చేయకపోవడంతో చెరువులు, వాగులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలో మొత్తం 1063 చెరువులుతో పాటు ప్రధానంగా మున్నేరు, ఆకేరు, పాలేరు, అలిగేరు వాగులున్నాయి. సర్కారు నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమితో జిల్లాలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో అడుగంటడంతో వాటి కింద సాగుచేసిన రైతులకు పంటలను కాపాడుకునేందుకు పాట్లు పడాల్సి వస్తోంది. జిల్లాలో అతి పెద్ద చెరువైన బయ్యారం పెద్ద చెరువు ఉన్నప్పటికీ వానకాలంలో ఈ చెరువు ద్వారా 7,500 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. యాసంగిలో అసలు నీళ్లు ఇవ్వకపోవడంతో బోరుబావుల మీద రైతులు ఆధారపడాల్సి వస్తోంది. అలాగే గార్ల పెద్దచెరువు వానకాలంలో 3వేల ఎకరాలు, యాసంగిలో వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించేవారు. ఇప్పుడు ఈ చెరువు కూడా పూర్తిగా ఎండిపోవడంతో చెరువు కింద సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరమైంది. మున్నేరు వాగు మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి వద్ద ప్రారంభమై బయ్యారం, గార్ల మండలాల మీదుగా డోర్నకల్ వరకు ఈ వాగు ద్వారా ప్రతి యాసంగిలో సుమారుగా 10వేల నుంచి 12వేల ఎకరాల వరకు సాగయ్యేది. ఆకేరు వాగు జిల్లాలో తొర్రూరు మండలం గుర్తూరులో మొదలై నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం నుంచి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ వాగు ద్వారా 8వేల నుంచి 10వేల ఎకరాలు సాగయ్యేది. కేసముద్రం మండలం వట్టివాగు ద్వారా 1,500 ఎకరాలు సాగయ్యేది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వాగులకు ఇరువైపులా ఉన్న పంట పొలాలతో పాటు చెరువుల్లో సరిపడా నీళ్లు లేక వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోతుంది. బోరుబావుల ద్వారా కూడా సాగు కావడం లేదు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో నీళ్లు లేక వరి, మక్కజొన్న పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది.

## తడి ఆరింది.. మడి ఎండింది




## రైతుబంధు రాలే.. రుణమాఫీ కాలే

నాకు మొత్తం 12 ఎకరాల భూమి ఉంది. 6 ఎకరాల్లో వరి, ఎకరంలో మిర్చి, మరో ఎకరంలో మక్కజొన్న మిగతాది పత్తి వేశాను. నా పేరుపై బ్యాంకులో రెండు లక్షలు, నా భార్య పేరుతో రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్నాం. ఒక్కరికీ కూడా రుణమాఫీ కాలేదు. ఇప్పటివరకు ఒక ఎకరానికి కూడా రైతుబంధు పడలేదు. వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడి మొత్తం వడ్డీకి తెచ్చిన. ఆరెకరాల్లో వరి వేస్తే 5 ఎకరాలు ఎండిపోయింది. బోరుబావుల నుంచి చుక్కనీరు వస్తలేదు. మిగిలిన ఎకరం వరి కూడా ఎండిపోతది. ఎండిన వరి పొలంలో గొర్లు, బర్లను మేపుతున్నా. ఎకరం మక్కజొన్న పంట కూడా ఎండిపోయింది. అడవి పందులు తింటున్నాయి. వరికి రూ.2 లక్షల పెట్టుబడి అయ్యింది. ఆదాయం రాలేదు. మిర్చి ఎకరం వేస్తే అందులో నష్టపోయా. పత్తిలోనూ నష్టం వచ్చింది. అన్ని పంటలు కలిపి రూ.5లక్షలకు పైగా నష్టపోయా. ఎండిన పంటలు చూసి బావి వద్దకు పోవడం లేదు. గొర్లను మేపుతూ బతుకుతున్న. కేసీఆర్ సర్కారున్నప్పుడు రుణమాఫీ అయ్యింది, ఠంచన్‌గా రైతుబంధు వచ్చేది. పెట్టుబడికి ఎన్నడూ ఇబ్బంది రాలే. రేవంత్‌రెడ్డి సర్కారు అన్నిటికీ ఆగమైతానం.

*– పులిగిల్ల సతీశ్, రైతు, గట్లకుంట*

## సాగునీటి కోసం తండ్లాడుతున్న ఆయకట్టు రైతులు


*గంట్లకుంటలో ఎండిపోయిన వరి పంటను మేస్తున్న గొర్రెలు, గేదెలు*

# ఏరు ఎండి.. రాళ్లు తేలి..

బయ్యారం, మార్చి 4 : పాకాల ఏరు అడుగంటి ఆయకట్టు ఎండుతున్నది. చుక్క నీరు లేక, పంటలను కాపాడుకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. బయ్యారం మండలంలోని జగ్గుతండా, బంజారతండా, నర్సాతండా, వెంకట్రాంపురం, చోక్లతండా, పత్యతండా, గొల్లగూడెం, జనార్దనపురం గ్రామాలతోపాటు సరిహద్దు కురవి మండలం గుండ్రాతిమడుగుకు చెందిన రైతులకు పాకాల ఏరు నీరే ఆధారం. సుమారు 1500 ఎకరాలకు పైగా యాసంగిలో వివిధ పంటలు సాగు చేసేవారు. అయితే, రెండేళ్ల నుంచి నీరు సరిగ్గా ఉండడం లేదు. దీంతో ఈ ఏడాది కొందరు రైతులు పంటలు వేయడం మానేయగా, మరికొందరు నీళ్లు వస్తాయనే ఆశతో వరి, మినుములు, పెసర వంటి పంటలు సాగు చేశారు. అయితే, ఏరులో ఉన్న అరకొర నీటితో ఇప్పటి వరకు పంటలను కాపాడుకున్నారు. ప్రస్తుతం వరిపొట్ట దశకు చేరింది. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో ఏరులో నీరు పూర్తిగా అడుగంటి రాళ్లు, రప్పలు తేలాయి. ఎండుతున్న పంటలను బావుల్లోని నీటితో కొందరు, ఏరులో అక్కడక్కడా నిలిచిన నీటిని మోటర్ల ద్వారా పంటలకు మళ్లించి మరికొందరు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో వారంపాటు ఇదే పరిస్థితి ఉంటే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆవేదన చెందుతున్నారు. తాళ్లపూసపల్లి చెరువుకు చేరుకునే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని మత్తడి ద్వారా పాకాల ఏరుకు మళ్లించి పంటలను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# భూమిస్తారా? డబ్బులిస్తారా?

## మభ్యపెట్టే మాటలొద్దు.. స్పష్టమైన హామీ ఇవ్వండి

- మొదట మా గ్రామాలకు రోడ్డు వేయండి
- మామునూరు ఎయిర్‌పోర్టు భూ సర్వే అడ్డుకున్న రైతులు, అధికారుల నిలదీత


తమకు న్యాయం చేయాలని నక్కలపల్లి- గుంటూరుపల్లి రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

కరీమాబాద్, మార్చి 4 : 'మభ్యపెట్టే మాటలొద్దు.. మామునూరు ఎయిర్‌పోర్టుకు మా భూములు ఇచ్చేందుకు సిద్ధం.. పరిహారం భూమికి భూమి ఇస్తారా.. డబ్బులిస్తరా.. స్పష్టమైన హామీ ఇవ్వండి.. అలాగే మొదట మా గ్రామాలకు రోడ్డు నిర్మించండి' అని మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూ సర్వే చేసేందుకు మంగళవారం నక్కలపల్లికి వచ్చిన అధికారులను పలు గ్రామాల రైతులు అడ్డుకున్నారు. రంగశాయిపేట నుంచి తమ గ్రామాల మీదుగా ఉన్న రోడ్డును మూసేస్తామంటున్నారు.. మొదటగా రోడ్డు నిర్మించిన తర్వాతే సర్వే చేపట్టాలని నక్కలపల్లి, గుంటూరుపల్లి, నల్లకుంట, గాడిపెల్లి రైతులు గ్రామాల అధికారులను నిలదీశారు. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, ఇంకా అనుమతి రాలేదని అధికారులు చెప్పగా, అనుమతి వచ్చిన తర్వాతే ఇక్కడికి రండి.. అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సమావేశాలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు తలోమాట చెబుతూ రైతులను మభ్యపెడుతున్నారన్నారు. తాము ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదని కానీ, ప్రభుత్వం తమకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రజాప్రతినిధులు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూమిని ఇచ్చిన భూ యజమానులకు సమీపంలోని భూములను ఇస్తామని చెప్పారని, తర్వాత వచ్చిన అధికారులు భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందజేస్తామంటున్నారన్నారు. మంత్రి మాటలకు, స్థానిక ఎమ్మెల్యే మాటలకు పొంతనలేదన్నారు. పరిహారం ఎంత మేరకు ఇస్తారు.. అనేది నేటికీ స్పష్టత లేదన్నారు. ఈ విషయ మై మంత్రి, ఎమ్మెల్యేను కలిసేందుకు వెళితే తమ బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేదాక సర్వే చేయొద్దన్నారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు రైతులతో మాట్లాడేందుకు ప్రయత్నించినా సర్వే చేయొద్దని తెగేసి చెప్పారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. సర్వేను రైతులు అడ్డుకోవడంతో ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించింది. డీసీపీ రవీందర్‌తో పాటు పరకాల, మామునూరు, నర్సంపేట ఏసీపీలు చేరుకున్నారు. నిరసన చేపట్టిన రైతులను అడ్డుకున్నారు. నిరసన కార్యక్రమాలకు అనుమతి లేదని వారించారు. రైతులు రోడ్డుపైకి రాకుండా అడ్డుకున్నారు. రైతులు జై జవాన్-జై కిసాన్ అని నినాదాలు చేశారు.

***సంబురాలే కాదు.. సమస్యలను పరిష్కరించండి...***

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తమ వల్లే అనుమతులు వచ్చాయని పోటీ పడి మరీ సంబురాలు చేసుకున్న అధికార పార్టీ నాయకులపై రైతులు మండిపడ్డారు. సంబురాలు చేసుకోవడమే కాదు.. మా సమస్యలను పరిష్కరించడంలోనూ పోటీ పడండి.. అంటూ చురకలు అంటించారు. ప్రజాప్రతినిధులుగా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తలోమాట మాట్లాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే పొంతనలేని మాటలతో ఆగం చేస్తున్నారన్నారు. ఎకరానికి రూ.3 నుంచి రూ.5 కోట్లు ఇవ్వాలన్నారు.

### డిమాండ్లకు ఒప్పుకొంటేనే సర్వే చేయనిస్తం



సంగెం, మార్చి 4 : మా డిమాండ్లు పరిష్కరిస్తేనే సర్వే చేయనిస్తం. వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణం మంచిదే. అలాగే మా సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలి. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామాలకు చెందిన రైతులం 253 ఎకరాలు కోల్పోతున్నాం. ఇందులో గుంటూరుపల్లి గ్రామంలో 123 ఎకరాలు, గాడెపల్లి చెరువు 20 ఎకరాలు, నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో 110 ఎకరాలు కోల్పోతున్నాం. సరియైన పరిహారం ఇవ్వకుండానే భూముల్లోకి వచ్చి సర్వే చేస్తామంటే మేము ఎట్లా ఒప్పుకుంటాం. గతంలో గ్రామంలోకి వచ్చిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద భూములకు బదులుగా భూములు, డిమాండ్ ప్రకారం పరిహారం ఇస్తామని తలా ఓ మాట చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేకపోవడంతోనే ఇదంతా జరుగుతున్నది.

*– వీరభద్రారావు, గుంటూరుపల్లి రైతు*

### ఎకరానికి రూ.5 కోట్లు ఇవ్వాలి



ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న మాకు ప్రభుత్వం ఎకరానికి రూ.ఐదు కోట్లు ఇవ్వాలి. వరంగల్ నగరానికి ఆనుకొని ఉన్న మా భూములకు రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఉన్న వరంగల్-మహబూబాబాద్ రోడ్డు మూస్తే మా గుంటూరుపల్లి నుంచి నేరుగా మామునూరుకు రోడ్డు వేయాలి. అలాగే భూములు కోల్పోతున్న నిర్వాసితుల కుటుంబాలకు వారి అర్హతను బట్టి విమానాశ్రయంలో ఉద్యోగాలు కల్పించాలి. ఇవి ప్రధాన డిమాండ్లు. ఇవి తీర్చినట్లయితే భూములు ఇవ్వడానికి సిద్ధం.

*– వెంకట్రావు, గుంటూరుపల్లి రైతు*

## బీఆర్‌ఎస్ హయాంలోనే ఎయిర్‌పోర్టుకు అడుగులు

- కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల తలోమాటతో రైతుల్లో ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కరీమాబాద్, మార్చి 4 : బీఆర్‌ఎస్ హయాంలోనే మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. నాటి తెలంగాణ ప్రభుత్వం, కేంద్రంతో పాటు జీఎంఆర్ సంస్థతో చర్చలు జరిపి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కృషిచేసింది. ఎన్నో ఏండ్ల పాటు సేవలందించిన ఈ ఎయిర్‌పోర్టు నాటి కాంగ్రెస్ హయాంలోనే మూతబడింది. దశాబ్దాల తర్వాత పునరుద్ధరణకు అడుగులు పడుతున్న వేళ ప్రజాప్రతినిధుల తలోమాటతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూమికి భూమి ఇస్తామని ఒకరు.. డబ్బులిస్తామని మరొకరు చెప్పడంతో ఎవరి మాట నమ్మాలో తెలియక ఆగమవుతున్నారు. దీంతో పాటు గవిచర్ల రహదారిని మూసివేస్తే తమకు దారిని ఎలా ఏర్పాటు చేస్తారో కూడా ప్రజలకు చెప్పకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భూమిలిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు అడిగినా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయం. జీవో కాదు డబ్బులు కేటాయించాలి. రైతులతో చర్చించాలి. మార్కెట్ రేట్ ప్రకారం డబ్బులు చెల్లించాలి. కాలయాపన చేస్తే రైతులు కాదు ప్రజలు కూడా తిరగబడతారు.

# మక్కలే మక్కలు..

- నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కళ కళ
- పల్లెల నుంచి దండిగా తీసుకొచ్చిన రైతులు
- ఆరబెట్టేందుకు స్థలం లేక ఇబ్బందులు

నర్సంపేట, మార్చి 4: నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు మక్కలతో కళకళలాడింది. రైతులు భారీగా తీసుకురావడంతో మార్కెట్‌లో ఎటుచూసినా పచ్చని పరదా కప్పినట్లు కనిపించింది. అయితే రోజుల తరబడి అలాగే ఉండడంతో యార్డు మొత్తం మక్కలతో నిండిపోయింది. గ్రామాల్లో మక్కలు ఆరబోసేందుకు సరైన కల్లాలు, స్థలాలు లేక రైతులు ఇక్కడికి తరలివస్తున్నారు. ఒక దశలో మార్కెట్‌లో ఆరబెట్టేందుకు స్థలం సరిపోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో కాలుతీసి కాలు వేసే పరిస్థితి లేకుండా మక్కలు ఉన్నాయి. మక్కలు సరిగ్గా ఎండక రైతులు రోజుల తరబడి మార్కెట్‌లోనే ఉంటున్నారు. వ్యాపారులు తేమ చూసి మక్కలను విక్రయిస్తుండగా తేమ శాతం తక్కువ ఉన్న మక్కలను మాత్రమే ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా 14-15 శాతం ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. అంతకంటే ఎక్కువ ఉన్న మక్కలను కొనకపోవడంతో రైతులు స్థానికంగా ఉన్న ఈ మార్కెట్ యార్డులో రోజల తరబడి ఆరబోస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతు వారం, పది రోజులు ఇక్కడే ఉంటూ మక్కలను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2200లు మాత్రమే పలుకగా ప్రైవేట్ వ్యాపారులు రూ.2310 నుంచి రూ.2360వరకు ధరలు పెట్టి మక్కలను కొనుగోలు చేస్తున్నారు. గడిచిన వారం రూ.2400 వరకు పలకడంతో రైతులు ప్రైవేటు ప్రైవేటు వైపే మొగ్గుచూపుతున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో తాగు నీటి, ఇతర సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రైతులు మార్కెట్‌కు భారీగా తరలివచ్చిన మక్కలు

